పడి ఉన్న ధగ ధగ మెరిసే వజ్రాలు కనిపిస్తాయి. వారు వెంటనే తమ జేబుల నిండా ఆ వజ్రాలని నింపుకుంటారు. ఆశ చావక నీటిని నింపాల్సిన తోలు సంచీల్లో కూడా వజ్రాలని ఆనందంగా నింపుకుంటారు. ఐతే ఆ ఆనందం వారికి ఎక్కువ సేపు ఉండదు.

ప్రయాణం కొనసాగించాక వారికి దాహం వేస్తుంది. నీటి సంచీల్లోని వజ్రాలు దాహాన్ని తీర్చలేవు కదా? త్వరలోనే వారి దేహాలు రాలిపోతాయి. వారు కూడా చుట్టు పక్కల పడి ఉన్న మిగిలిన అస్థిపంజరాల్లో కలిసిపోతారు. వజ్రాలకి బదులు సంచీల్లో నీళ్ళని తీసుకెళ్తే జీవించి ఉండటమే కాక, జేబుల్లోని వజ్రాలని అమ్ముకుని సుఖంగా జీవించ గలిగేవారు.

ఆశ! ధనాశ! మనిషిని ఎన్నో యుగాలుగా ఆధ్యాత్మికంగా నాశనం చేస్తున్న వినాశిని ధనమే.

## 32. ఇంకా ఉదయం కాలేదు

తన పదహారో ఏటే ఆధ్యాత్మిక తపనతో స్వంత ఇంటిని, ఊరుని వదిలిపెట్టి ఒకడు హిమాలయాలకి వెళ్ళిపోయాడు. ఋషికేశ్‌లో ఓ గురువు దగ్గర మంత్ర దీక్ష తీసుకుని, ఆయన సూచన ప్రకారం చలికాలం ఆరు నెలలు ఉత్తర కాశీలో, వేసవి వర్షా కాలాలు ఆరు నెలలు గంగోత్రిలో వుంటూ ఆధ్యాత్మిక సాధనలని చేయసాగాడు.

నియమ నిష్టలని పాటిస్తూ, నిత్యం ఉదయం నాలుగు నించి రాత్రి తొమ్మిది దాకా అతను పూజ, జప, ధ్యానాలని చక్కగా అనుష్టించసాగాడు. తనకి అరవై ఏళ్ళు వచ్చేదాకా క్రమం తప్పకుండా అతను ఆ ప్రకారం జీవించాడు. చాలాకాలంగా నిష్టగా అనుష్టానం సాగిస్తున్నా తనకి ఎలాంటి భగవదానుభూతి కలగక పోవడంతో అతనిలో అసంతృప్తి బాగా పేరుకోసాగింది. తను చేసిందానికి ప్రతిఫలం లభించలేదన్న బాధతో అతను ఆధ్యాత్మిక జీవితాన్ని వదిలేసి, తిరిగి లౌకిక జీవితంలోకి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. దాంతో కాషాయాలని వదిలేసి, హిమాలయాలని వదిలి తన స్వగ్రామం వైపు బయలుదేరాడు.

ఓ రోజు అతను ఓ దేశ రాజధానిలోని ఓ సత్రంలో బసచేసాడు. రాత్రి భోజనాలయ్యాక అంతా సత్రం మేడ మీదకి చేరడం గమనించాడు. కొద్దిసేపట్లో సత్రం పక్కనే వున్న ఇంట్లోంచి శ్రావ్యంగా ఓ పాట వినిపించసాగింది. కాసేపు ఆ పాట విని అతను కూడా మేడ మీదకి వెళ్ళి చూస్తే, చక్కగా అలంకరించుకున్న ఓ అందమైన అమ్మాయి ఆ పాటకి అణుగుణంగా నృత్యం చేస్తూ కనిపించింది. అతను మిగిలిన వాళ్ళలా ఆమె గాత్రాన్ని, నృత్యాన్ని ఆస్వాదించసాగాడు.

అలా ఆమె చాలా గంటల పాటు పాడుతూ నృత్యం చేస్తూంటే అతనికి కాలమే తెలీలేదు. తెల్లవారబోయే ముందు ఆమె నిరాశగా తన తల్లితో చెప్పిన మాటలు ఇంకా మేలుకుని చూస్తున్న అతను విన్నాడు.

"అమ్మా! ఇంక ఈ రోజునించి నేను నృత్యం చేయడం ఆపేస్తాను. సత్రంలో బసచేసే వాళ్ళల్లో కొన్ని వేలమంది నా నృత్యాన్ని చూసారు కాని, మనం ఆశించినట్లుగా ఇంతదాకా ఎవరూ నా నృత్య నైపుణ్యం గురించి రాజుగారి చెవిన వెయ్యలేదు. తన సభకి వచ్చి నన్ను నృత్యం చేయమని రాజుగారి నించి ఇంతదాకా నాకు పిలుపు రానేలేదు. మనకా అదృష్టం లేదనుకుని మనం తిరిగి మన వూరు వెళ్ళిపోదాం."

"అలా కాదమ్మ. ఇంకొన్ని రోజులు ఆగు. ఇంకా ఉదయం కాలేదు. చీకట్లు తొలగి సూర్యుడు వుదయించడానికి టైం పడుతుంది కదా."

తల్లి మాటలు విని కూతురు నృత్యాన్ని కొనసాగించింది.

రెండు రోజుల తర్వాత మహారాజు నించి కొందరు మనుషులు వచ్చి ఆమెకి రాజసభలో నృత్యం చేయడానికి ఆహ్వాన పత్రాన్ని ఇచ్చి తగిన రీతిలో గౌరవించారు.

ఇదంతా గమనించిన అతను ఆధ్యాత్మిక సాధనని విడిచి వచ్చినందుకు ఎంతో సిగ్గుపడ్డాడు. 'ఇంకొన్ని రోజులు ఆగు. ఇంకా ఉదయం కాలేదు.' అని తన కూతురుకి చెప్పిన ఆ తల్లి మాటలని మననం చేసుకున్నాడు. తన జీవితం ముగియలేదు. ఇంకా కొంతకాలం తను జీవిస్తాడు. ఆధ్యాత్మిక సాధనలని చేస్తూ

లక్ష్యం కోసం పట్టుదలగా వేచి చూడాలి తప్ప మధ్యలో దాన్ని ఆపకూడదన్న సత్యాన్ని గ్రహించాడు. ప్రాపంచిక విషయాల్లో సాధించడానికే ఆమె అంత పట్టుదలతో వుంటే, దానికన్నా ఇంకా కష్టతరమైన ఆధ్యాత్మికతలో సాధించడానికి తను ఇంకా ఎంత పట్టుదలతో వుండాలి?

దాంతో అతను ప్రాపంచిక దుస్తులని విడిచి, కాషాయ వస్త్రాలని మళ్ళీ ధరించి తన లక్ష్యం సాధించడానికి తిరిగి హిమాలయాలకి వెళ్ళిపోయాడు. అతను తన తుది శ్వాసని భగవన్నామస్మరణతో వదలడంతో మరణ సమయంలో మోక్షాన్ని సాధించాడు.

## 33. ఏనుగు స్నానం

తమ గ్రామ రచ్చ బండ దగ్గర కూర్చుని తోటి గ్రామస్థులతో ఇచ్చకాలాడుతున్న ఒకడు దూరంగా వెళ్తున్న ఓ సాధువుని చూసాడు. అతను ధ్యాన సాధకుడు కాబట్టి ఆయన దగ్గరకి పరుగెత్తుకుని వెళ్ళి పాద నమస్కారం చేసి తనకి ఏదైనా మంచి ఉపదేశం ఇవ్వమని కోరాడు.

"ఏనుగు స్నానం మాను." అతన్ని ఎగాదిగా చూసి చెప్పి వెళ్ళిపోయాడు ఆ సాధువు.

ఏనుగు స్నానం అంటే ఏమిటో అతనికి బోధపడలేదు. రచ్చబండ దగ్గరకి వెళ్ళి అక్కడ ఉన్న పది మందికీ సాధువు తనకి చెప్పిన మాటలని చెప్పి అడిగాడు.

"మీలో ఎవరికైనా ఏనుగు స్నానం అంటే ఏమిటో తెలుసా?"

ఎవరూ ఆధ్యాత్మికమైన వివరణని ఇచ్చే సమాధానాన్ని చెప్పలేకపోయారు.

"మన గ్రామం అవతల అడవిలో గల చెరువులోకి ఏనుగులు తరచు వచ్చి స్నానాలు చేస్తూంటాయి. వెళ్ళి వాటి స్నానం చూస్తే ఆ సాధువు మాటలకి అర్థం తెలియచ్చు." ఒకరు సలహా ఇచ్చారు.

అతను మర్నాడు ఉదయం అడవిలోని చెరువు దగ్గరకి వెళ్ళి చూస్తే, ఓ ఏనుగు అప్పుడే చెరువులోకి దిగుతూ కనిపించింది. అతను ఆసక్తిగా దాన్ని